సాక్షి
అనకాపల్లి
బుధవారం । 16 । ఏప్రిల్ । 2025



బాణసంచా కేంద్రాల తనిఖీ

అనుమతుల్లేకుండా బాణసంచా తయారు చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ జి.చిన్నికృష్ణ హెచ్చరించారు. 8లో



భారీ వర్షం.. సేదతీరిన జనం

మండుతున్న ఎండలతో అల్లాడిపోతున్న చోడవరం ప్రజలకు మంగళవారం కురిసిన వర్షం ఊరట కలిగించింది. 8లో

ఉష్ణోగ్రతలు

మంగళవారం

		గరిష్టం/కనిష్టం
అనకాపల్లి	:	34.3/24.3
చోడవరం	:	34.0/22.0

- నాటక రంగానికి పుట్టినిల్లుగా మునగపాక
- కళాకారులను ప్రోత్సహిస్తున్న గ్రామీణ యువజన మందిరం
- సందేశాత్మక నాటికల ప్రదర్శనలతో ప్రాచుర్యం

మునగపాకలోని తులసీకళా వేదిక



టీవీ, సినిమాల ప్రభావంతో అస్థిత్వం కోల్పోతున్న నాటకరంగం ఇక్కడ సజీవంగానే ఉంది. ఉత్తరాంధ్ర కళలకు కాణాచి అయితే మునగపాక నాటకరంగానికి పుట్టినిల్లు. ఈ గ్రామం ఎన్నో రాష్ట్ర, జిల్లాస్థాయి పరిషత్‌లు నిర్వహించడానికి వేదిక కావడమే కాక వందల సంఖ్యలో నాటకరంగ కళాకారులను కూడా కళామతల్లికి అందిస్తోంది. నటించడం, దర్శకత్వం వహించడంతో పాటు రచనలు చేయడం కూడా ఇక్కడి కళాకారులకు వెన్నతో పెట్టిన విద్య. పలు ప్రజా ఉద్యమాల్లో మునగపాకవాసులు భాగస్వాములు కావడం సాంఘిక నాటకాలు అందించిన ప్రేరణే అని చెబుతుంటారు.

నేడు తెలుగు నాటకరంగ దినోత్సవం సందర్భంగా....

కళకళ లాడే రంగస్థలం



సురభి నాటకంలోని ఓ ఘట్టం (ఫైల్)

మునగపాక :

మునగపాకలో నాటకరంగం నేటికీ అభివృద్ధి చెందుతుందంటే మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ పీవీ రమణ కృషేనని చెప్పకతప్పదు. ఈ ప్రాంత కళాకారులకు రమణ స్ఫూర్తి ప్రదాతగా నిలుస్తారు. రమణతో పాటు మాజీ సర్పంచ్ పెంటకోట జోగినాయుడు, ఆడారి పోలయ్య, వెలగా వీరునాయుడు మాస్టారు, ఆడారి అప్పారావు, పెంటకోట చెల్లయ్యరమణతో పాటు మరికొంతమంది కృషి ఉందంటారు. పౌరాణిక నాటకాలతో పాటు సాంఘిక నాటకాల ప్రదర్శన ద్వారా సామాజిక స్పృహ తీసుకురావాలని నిరంతరం కృషి చేసేవారు.

కళలపై ఎనలేని అభిమానం...

ఈ గ్రామస్తులకు పూర్వం నుంచి సాహిత్యం మీద, కళల మీద అభిమానం. తద్వారా నాటకరంగం పట్ల ఆకర్షితులై పలు నాటకాలను ఇక్కడ ప్రదర్శించే అనుభూతి ఉంది. వందేళ్ల నుంచి ఇక్కడ నాటక ప్రదర్శనలు జరుగుతున్నప్పటికీ గత 68 సంవత్సరాలుగా ఈ బాధ్యతను మునగపాక గ్రామీణ యువజన మందిరం నిర్వహిస్తూ వస్తోంది. 1902లో స్థానికుడైన భమిడిపాటి అప్పకవి 'పారిజాతం' అనే వీధి భాగవతం రాశారు. కాలక్రమేణ పౌరాణిక నాటకాలు ప్రదర్శించేవారు. సాంఘిక నాటకాలపై వారందరి దృష్టిని మళ్లించి నాటకాల పట్ల ఆసక్తి కల్పించడంలో రమణ కృషి చేసేవారు.

ఇక్కడ ప్రదర్శించిన 'పాలేరు' నాటకం అప్పట్లో విజ్ఞతను ప్రోత్సహించే మంచి సందేశాన్నిచ్చి ప్రజాభిమానాన్ని చూరగొంది.

స్ఫూర్తిదాయకం... గ్రామీణ యువజన మందిరం

సినిమాల ప్రభావంతో కనుమరుగవుతున్న నాటకరంగాన్ని బతికించుకోవడానికి మునగపాకలో యువత 1957లో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. 1958లో దీనికి గ్రామీణ యువజన మందిరంగా నామకరణం చేశారు. నాటి నుంచి ఈ సంస్థ ఆధ్వర్యంలో విజ్ఞానంతో పాటు వినోదాన్ని అందించేలా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ప్రదర్శనలకు అనువుగా కళావేదిక

గతంలో ఉన్న కళామందిరం శిథిలావస్థకు గురవడంతో గతంలో గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు విశాఖ డెయిరీ చైర్మన్ తులసీరావు కళాకారుల సౌకర్యార్థం కళావేదిక ఏర్పాటుకు రూ.24లక్షల మంజూరు చేయడంతో కళావేదిక సిద్ధమైంది. ప్రముఖ నాటకరంగ దర్శకుడు ఎల్.సత్యానంద్ పర్యవేక్షణలో ఈ కళామందిరం రూపుదిద్దుకుంది.

ఎంతోమంది కళాకారులకు ప్రోత్సాహం

మునగపాకలోని నందీశ్వర కళా ప్రాంగణంపై ఇంతవరకు సుమారుగా 650 నాటక సమాజాలు ప్రదర్శనలిచ్చాయి. రాష్ట్ర స్థాయిలో 28, జిల్లాస్థాయిలో 45 వరకు పరిషత్‌లు నిర్వహించిన ఘనత మునగపాకకే దక్కుతుంది. మునగపాకకు చెందిన యువ రచయిత విల్లూరి జగ్గప్పారావు 30 నాటికలు, నాటకాలకు రచనలు అందించారు. ఆడారి సోమశేఖర్ అనే యువ రచయిత ఇటీవల 'దుర్యోధనుడి అంతరంగం' అనే పౌరాణిక నాటకాన్ని రచించి అందరి మన్ననలు అందుకున్నారు. ఇదే గ్రామానికి చెందిన యువ రచయిత దాడి జగన్నాథరావు కూడా పలు కొత్త రచనలు చేసి కళాకారులను ప్రోత్సహిస్తూ వస్తున్నారు. మునగపాకకు చెందిన కోరుకొండ గోపి పలు రచనలు చేయడంతో పాటు రెండు సినిమాలకు దర్శకత్వం వహించారు.



మునగపాక కళాకారులను సత్కరిస్తున్న దృశ్యం(ఫైల్)

ఏటా తెలుగునాటకోత్సవాలు...

కందుకూరి విరేశలింగం పంతులు జయంతి సందర్భంగా తెలుగునాటక రంగ దినోత్సవంగా గుర్తింపు. 2007లో అప్పటి ప్రభుత్వం విరేశ లింగం పంతులు జన్మదినాన్ని తెలుగునాటక రంగ దినోత్సవంగా ప్రకటించింది. నాటి నుంచి నేటి వరకు నాటక రంగం దినదినాభివృద్ధి చెందుతూ వస్తుంది. కళాకారులను ప్రభుత్వాలు ప్రోత్సహించడంతో గ్రామీణ ప్రాంతాల్లో కూడా నాటక రంగంపై ఎంతో మంది ఆసక్తి చూపుతూ వస్తున్నారు. ఏటా తెలుగునాటక రంగ దినోత్సవ వేడుకలను మునగపాకలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా మంగళవారం పలువురు యువ రచయితలను సత్కరించేందుకు సన్నద్ధమయ్యారు.

సందేశాత్మక నాటకాలు రావాలి



సమాజానికి మంచి సందేశాన్నిచ్చే నాటకాలు రావాల్సి ఉంది. ఎంతోమంది కళాకారులను ప్రోత్సహిస్తున్న గ్రామీణ యువజన మందిరం సేవలు అభినందనీయం. నాటకాల ప్రదర్శనలు చూసి నాకు నటనతో పాటు రచనలు చేయడం అలవాటుగా మారింది. ఇప్పటికి 6 నాటికలు రాశాను. వాటికి కళాకారుల నుంచి ఎంతో మద్దతు వచ్చింది. కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.

–దాడి జగన్నాథరావు, యువ రచయిత, మునగపాక

కళాకారులకు పెట్టింది పేరు..



మునగపాక అంటేనే కళాకారులకు పెట్టింది పేరు. నిరక్షరాస్యులైన వారు సైతం నటించేందుకు ఆసక్తి చూపుతూ వస్తున్నారు. ఇక్కడ నాటకరంగం ఇంకా బతికి ఉందంటే కారణం గ్రామీణ యువజన మందిరం అందించే ప్రోత్సాహమే. నేను రచించిన నాటికలు రాష్ట్రస్థాయిలో జరిగిన పోటీల్లో ప్రదర్శనలిస్తే అయిదు సార్లు ఉత్తమ రచయితగా అవార్డులు అందుకున్నా. నాటకరంగాన్ని బతికించుకోవాల్సిన అవసరం ఉంది.

–ఆడారి సోమశేఖర్, యువ రచయిత, మునగపాక

ఈ కృషి కొనసాగుతుంది..



గ్రామీణ యువజన మందిరం, గ్రామీణ సాంస్కృతిక సంస్థ సంయుక్త నిర్వహణలో మునగపాకలో ఎన్నో నాటక పరిషత్‌లను ఏర్పాటు చేశాం. ప్రతి నెలా ఒక నాటకం ప్రదర్శించేలా గ్రామీణ యువజన సాంస్కృతిక విభాగాన్ని ఏర్పాటు చేశాం. కళాకారులను ఆదరిస్తున్నంత కాలం నాటకరంగం బతికే ఉంటుంది.

–నూరిశెట్టి రాము, గ్రామీణ సాంస్కృతిక సంస్థ కన్వీనర్

- ఉపాధి కూలీలపై కూటమి నేతల ప్రతాపం
- స్పీకర్ ఇలాకాలో రాజకీయ వివక్ష
- అధికారులకు పట్టని కూలీల గోడు

పచ్చ చొక్కాలకే ఉపాధి



ఉపాధి కోల్పోయిన మామిడిపాలెం కూలీలు



నర్సీపట్నం : కూటమి నాయకులు పేదల పొట్టకొడుతున్నారు. చివరకు రెక్కాడతే గానీ డొక్కాడని కూలీలకూ పార్టీ రంగు వేసి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. ఉపాధి హామీ పనులు కల్పించడంలో రాజకీయ వివక్ష చూపుతున్నారు. వైఎస్సార్ సీపీకి ఓటు వేశారన్న సాకుతో ఆ పార్టీ సానుభూతి పరుల ఉపాధిపై దెబ్బకొడుతున్నారు. ఉపాధి పనులు కల్పించకుండా వివక్షకు పాల్పడుతున్నారు. సాక్షాత్తూ స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు ప్రాతినిధ్యం వహిస్తున్న నర్సీపట్నం నియోజకవర్గం, మాకవరపాలెం మండలం, మామిడిపాలెంలో గ్రామంలో ఉపాధి పనులకు కల్పించడంలో రాజకీయ వివక్ష కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన దగ్గర నుంచి వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్న మేట్లను తొలగించేందుకు కూటమి నేతలు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో భరించలేని కూటమి నేతలు ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులపై ఒత్తిడి తెచ్చి వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు ఉన్న గ్రూపులకు రిజిస్ట్రేషన్ చేయలేదు. రిజిస్ట్రేషన్ కాకపోవడంతో పనులు కల్పించలేదు. పంచాయతీలో మొత్తం తొమ్మిది గ్రూపుల్లో 650 మంది ఉపాధి కూలీలు ఉన్నారు. వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్న నాలుగు గ్రూపుల్లోని 350 మంది కూలీలకు గడిచిన మూడు నెలల నుంచి ఉపాధి పనులు కల్పించలేదు. సుమారు వంద రోజుల నుంచి పనులు కల్పించకపోవడంతో ఉపాధి పనుల కోసం కూలీలు అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయింది. కూలికి వెళ్తేనే కానీ పూట గడవని కుటుంబాలు కావడంతో ఉపాధి కరువై ఆర్థిక ఇబ్బందులతో విలవిలాడుతున్నారు.

పనుల్లేవు పొమ్మన్నారు...

మామిడిపాలెం పంచాయతీ పరిధిలో మూడు గ్రామాలు ఉన్నాయి. 12 మంది మేట్లు, 650 మంది కూలీలు ఉన్నారు. అడిగర్లపాలెంలో 3 గ్రూపులు, పాతలూరు గ్రామంలో 2 గ్రూపులు, మామిడిపాలెం 4 గ్రూపుల్లో వైఎస్సార్ సీపీ సానుభూతిపరులైన మేట్లు ఉండడంతో రిజిస్ట్రేషన్లు నిలిపివేసి పనులు కల్పించలేదు. కూటమి నేతలు మేట్‌లను మార్చాలని చూశారు. వారంతా ధర్నా చేయడంతో తొలగింపునకు బ్రేక్ పడింది. ఆ అక్కసుతో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్న నాలుగు గ్రూపుల్లోని 350 మంది కూలీలకు పని కల్పించకుండా ఉపాధిపై దెబ్బకొట్టారు. నాలుగు నెలల నుంచి ఉపాధి పనులు కల్పించాలని ఉపాధి కూలీలు ఎంపీడీవో కార్యాలయం వద్ద శాంతియుతంగా ధర్నా చేసి నిరసన తెలియజేశారు. ఎన్ని ఆందోళనలు చేసినా ఉపాధి కూలీలకు కంఠశోష తప్ప అధికారులు వారి గోడు వినడం లేదు. పనులు కల్పించకుండా నిరుపేద కూలీలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

ఈ నెల 14న 350 మంది ఉపాధి కూలీలు పని ప్రదేశానికి వెళ్లారు. పని చేయడానికి కుదరదని అభ్యంతరం తెలపడంతో కూలీలంతా పనిముట్లతో వెనుతిరగాల్సి వచ్చింది. వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారనే ఒకే ఒక కారణంతో కూలీల ఉపాధికి దెబ్బకొట్టారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారు తప్ప పనులు కల్పించేందుకు ముందుకు రావడం లేదని కూలీలు వాపోతున్నారు.

కొంత మందికే పని...



కేవలం వివక్షతోనే కొంత మందికే పని కల్పిస్తున్నారు. ప్రతి గ్రామంలో మూడు నెలలు నుంచి పని కల్పిస్తుంటే మాకు పని కల్పించలేదు. అధికారులను అడుగుతుంటే రిజిస్ట్రేషన్ అవలేదంటున్నారు. రిజిస్ట్రేషన్లు చేయాల్సిన బాధిత అధికారులపై ఉంది. మేమంతా కూలి పనుల కోసం ఎక్కడికిపోవాలి. రాజకీయ కక్షతో లేబర్ పొట్ట కొట్టకూడదు.

– రాజాన వరహాలమ్మ (మామిడిపాలెం)

పేదలతో రాజకీయాలా...



అధికారపార్టీకి అనుకూలంగా ఉన్న వారికే పని కల్పిస్తున్నారు. మిగిలిన వారికి పని కల్పించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వీఆర్‌పి, టెక్నికల్ అసిస్టెంట్ కూటమి నేతలు చెప్పిన వారికే పని కల్పిస్తున్నారు.మూడు నెలలుగా పనులు కల్పించకుండా ఉపాధి హామీ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారు. గతంలో ఎప్పుడూ ఈ విధమైన రాజకీయ వేధింపులు లేవు. లేబర్ బతుకులతో అధికారులు ఆడుకోవడం సమంజసం కాదు.

– చుక్కా నూకరాజు (మామిడిపాలెం)

న్యూస్‌రీల్

1నుంచి వేసవి క్రీడా శిక్షణ

అనకాపల్లి : జిల్లాలో విద్యార్థినీ విద్యార్థులకు వేసవి క్రీడా శిక్షణ తరగతులు మే 1 నుంచి 31వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి ఎల్.వి.రమణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో వివిధ గ్రామీణ, పట్టణ ప్రాంతంలో 8 నుంచి 14 సంవత్సరాల వయసు గల 25 మంది బాలురు, 25 మంది బాలికలకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల వివిధ క్రీడల జిల్లా అసోసియేషన్, పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు ఈనెల 17లోపు dsaanakapalli2022@gmail.com లేదా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయానికి పంపవలసిందిగా ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 9963177814, 7013019144 నంబరును సంప్రదించాలని కోరారు.

పేలుడు బాధితుల్లో.. ఇద్దరి పరిస్థితి విషమం

- వెంటిలేటర్‌పై చికిత్స

మహారాణిపేట : కోటవురట్ల మండలం కైలాసపట్నం ప్రమాదంలో గాయాలైన క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. కేజీహెచ్ సీఎస్ఆర్ బ్లాక్‌లో జల్లూరి నాగరాజు, మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మడగల జానకీరామ్‌కు వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. కాగా వేలంగి సంతోషి, వేలంగి షారోణి, వేలంగి రాజు కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ ముగ్గురిని త్వరలో డిశ్చార్జ్ చేస్తారని కేజీహెచ్ వర్గాలు తెలిపాయి. ఇంకో క్షతగ్రాతుడు సియ్యాదుల గోవింద్ కేజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ వార్డులో చికిత్స పొందుతున్నారు.

మహిళ మెడలో పుస్తెలతాడు చోరీ

8లో

వేంపాడు సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

- పగటి పూట త్రీఫేజ్ విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్..



వేంపాడు సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ట్రాన్స్‌కో అధికారులు

నక్కపల్లి : మండలంలో వేంపాడు సబ్‌స్టేషన్ పరిధిలో వ్యవసాయానికి పగటి పూట త్రీఫేజ్ విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఈ సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌పార్మర్ లేకపోవడం, ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో సబ్‌స్టేషన్ పరిధిలో వ్యవసాయానికి అర్ధరాత్రి సమయంలో విద్యుత్ సరఫరా చేసేవారు. వారంలో మూడు రోజులు పగటి పూట, నాలుగు రోజులు అర్ధరాత్రి సమయంలో త్రీఫేజ్ సరఫరా చేయడం వల్ల రైతులు అనేక ఇబ్బందులుపడేవారు. ప్రభుత్వం పవర్‌ట్రాన్స్‌ఫార్మర్‌ను సమకూర్చినప్పటికీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా ఏర్పాటులో జాప్యం జరిగింది. రైతులు త్రీఫేజ్ సరఫరాలో పడుతున్న ఇబ్బందులపై సాక్షి దినపత్రికలో ఈ నెల 7వ తేదీన అర్ధరాత్రి వ్యవసాయ విద్యుత్ అన్న శీర్షికన కథనం వెలువడింది. రాత్రి సమయంలో త్రీఫేజ్ ఉచిత విద్యుత్ సరఫరా వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నామని, రాత్రిపూట పొలాల్లోకి వెళ్తే విషసర్పాల బారిన పడే ప్రమాదం ఉందంటూ రైతుల ఆవేదనను సాక్షిపత్రికలో రావడంతో ట్రాన్స్ అధికారులు స్పందించారు. సోమవారం వేంపాడు సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ పనులు పూర్తి చేశారు. వ్యవసాయానికి త్రీఫేజ్ విద్యుత్ సరఫరాను పగటి పూట తొమ్మిది గంటల పాటు నిరంతరాయంగా ఇచ్చే ఏర్పాట్లు చేశారు. ఈ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏఈ మహాంకాలరావు ప్రారంభించారు. రైతుల సమస్యను తెలుసుకుని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి'కి ఈ ప్రాంత రైతులు కృతజ్ఞతలు తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులు పూర్తి చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. విద్యుత్ సిబ్బందికి అభినందనలు తెలిపారు.

సులభతరంగా పౌరసేవలు

- మన మిత్ర – వాట్సాప్ గవర్నెన్స్.. 9552300009
- కరపత్రాన్ని ఆవిష్కరించిన కలెక్టర్



మన మిత్ర-వాట్సాప్ గవర్నెన్స్ కరపత్రాన్ని ఆవిష్కరించిన కలెక్టర్ విజయ కృష్ణన్, డీఎల్‌డీవో మంజులావాణి

తుమ్మపాల: పౌర సేవలను సులభతరంగా ప్రజలకు అందించడమే వాట్సాప్ గవర్నెన్స్ లక్ష్యమని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మన మిత్ర- ప్రజల చేతిలో ప్రభుత్వం' (వాట్సాప్ గవర్నెన్స్) కరపత్రాన్ని మంగళవారం ఆమె తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాట్సాప్ –9552300009 నంబర్‌ను మనమిత్ర పేరుతో నమోదు చేసుకుని 'హాయ్' అనే సందేశం పంపడం ద్వారా వివిధ రకాల ప్రభుత్వ సేవలను పొందవచ్చని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుత కాలంలో సైబర్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని, డిజిటల్ అరెస్టుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సైబర్ మోసాలకు సంబంధించి ఎటువంటి అనుమానం వచ్చినా టోల్ ఫ్రీ నెంబర్ 1930కు కాల్ చేయాలన్నారు. మహిళలు, చిన్నారుల భద్రతకు సంబంధించి ప్రభుత్వం ప్రవేశపెట్టిన శక్తి యాప్‌ను స్మార్ట్ ఫోన్‌లో ప్లే స్టోర్ నుండి డౌన్లోడ్ చేసుకుని మొబైల్ నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా ఆపద సమయంలో పోలీస్ శాఖ సహాయ సహకారాలు పొందవచ్చన్నారు. శక్తి యాప్ ఆపద వేళ మీ ఆత్మీయ నేస్తంగా ఉపయోగపడుతుందని తెలియజేశారు. పై కార్యక్రమాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించే విధంగా కార్యక్రమాలు చేపట్టాలని ఎంపీడీవోలకు మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామ వార్డు సచివాలయాల అధికారి ఎస్.మంజులవాణి, నర్సీపట్నం డివిజనల్ అభివృద్ధి అధికారి ఉదయశ్రీ పాల్గొన్నారు.

జాతీయ చిత్రలేఖనం పోటీల్లో పతకాల పంట




జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీలలో పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో పడాల్‌దాస్, ఉపాధ్యాయులు

- దేవరాపల్లి హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ
- నలుగురికి స్వర్ణం, ముగ్గురికి రజత పతకాలు

దేవరాపల్లి : జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటి పతకాల పంట పండించారు. నలుగురు విద్యార్థులు స్వర్ణ, ముగ్గురు రజత పతకాలను కైవసం చేసుకున్నారు. ఈ నెల 5న విజయవాడలో డ్రీమ్ యంగ్, చిల్డ్రన్స్ ఆర్ట్స్ అకాడమి, ఏపీ ఫారెస్టు డిపార్ట్‌మెంట్ సంయుక్తంగా నిర్వహించిన 12వ జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీల్లో దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 24 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలలో తమ ప్రతిభను చూపిన జి.జీవన్, జి. జశ్వంత్, జి. కావ్య, ఎం. సింహాద్రి స్వర్ణ పతకాలను సొంతం చేసుకున్నారు. సాయి సృజన, వై.చంద్రకాంత్, వై.జయవర్ధన్ రజత పతకాలను సాధించారు. ఆయా విద్యార్థులతో పాటు చిత్రలేఖనంలో తర్ఫీదునిచ్చిన డ్రాయింగ్ టీచర్ వై. సముద్రం, సోషల్ టీచర్ ఎల్. సత్యనారాయణను మండల విద్యాశాఖ అధికారి, స్థానిక హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు బి.పడాల్ దాస్ ఇతర ఉపాధ్యాయులు స్థానిక పాఠశాలలో మంగళవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ హెచ్ఎం డి.శ్రీనివాసరావు, హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్ వారాది దేముళ్లు, సత్యనారాయణ, ఐజాక్, ప్రసాద్, పీడీ బాబురావు పాల్గొన్నారు.

ఆధారాల కోసం విస్తృత తనిఖీ



బాణసంచా ప్రమాద స్థలంలో క్లూస్ కోసం పరిశీలిస్తున్న చీఫ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ నీలేష్ కుకుందే

కోటవురట్ల : కై లాసపట్నంలోని అగ్నిప్రమాదానికి గురైన విజయలక్ష్మి గణేష్ ఫైర్ వర్క్స్ ప్రదేశాన్ని ఫోరెన్సిక్ ఫైర్ చీఫ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ నీలేష్ కుకుండే మంగళవారం పరిశీలించారు. మొదటగా ప్రమాదం చోటుచేసుకున్న తయారీ యూనిట్-1 వద్ద క్షుణ్ణంగా పరిశీలించారు. అక్కడి నుంచి యూనిట్-2, ఫైర్ సేఫ్టీ పరికరాలు, ఇతర అంశాలపై పరిశీలించారు. బాణసంచా పేలుళ్లకు కారణమేంటి? పరిమితికి మంచి స్టాక్ చేయడమా?, ఒకే చోట ఎక్కువ మంది కార్మికులు పనిచేయడమా? ఏయే రసాయనాలు, లోహ లవణాలు వినియోగించారు..? ఆక్సిడైజర్లుగా నైట్రేట్, క్లోరేట్లు, పెర్కోరేట్లు వినియోగించారా? ఫ్యూజ్ కోసం బ్లాక్ పౌడర్ వినియోగం తదితర అంశాలపై ఆధారాల కోసం పరిశీలించారు. నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ పి.శ్రీనివాసరావు, నక్కపల్లి సీఐ ఎల్. రామకృష్ణారావు, ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

17న చోడవరంలో దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ

అనకాపల్లి : ఏపీ సమగ్ర శిక్షణ, అల్మికో సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 17న చోడవరం, కొత్తూరు గ్రామం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని, జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్.జయప్రకాష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 0-18 సంవత్సరాలలో దివ్యాంగ పిల్లలకు గతంలో పేర్లు నమోదు చేసుకున్న వారికి మాత్రమే ఉపకరణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. 262 మంది దివ్యాంగ విద్యార్థులను గుర్తించడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా బ్యాటరీ ట్రైసైకిల్స్ 9 మందికి, ట్రై సైకిల్స్ 20 మందికి వీల్ ఛైర్స్ 95 మందికి, సీపీ ఛైర్స్ 46 మందికి, బ్రెయిలీ కిట్స్ 23 మందికి, వినికిడి యంత్రాలు 69 మంది దివ్యాంగులకు అందజేయడం జరుగుతుందన్నారు. గతంలో ఎంపికైన విద్యార్థులు ఆధార్‌కార్డు, సదరం సర్టిఫికెట్, రేషన్ కార్డు జెరాక్స్ కాపీలు, రెండు ఫొటోలు తీసుకుని రావాలని ఆయన కోరారు.

నేడు జెడ్పీ సమావేశం

మహారాణిపేట : ఉమ్మడి విశాఖ జిల్లా ప్రజాపరిషత్ సర్వ సభ్య సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు జెడ్పీ ఛైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన జరగనుందని జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించే సర్వసభ్య సమావేశానికి జెడ్పీటీసీ సభ్యులు, ఆహ్వానితులు హాజరుకావాలని కోరారు. సమావేశానికి అన్ని శాఖల జిల్లా అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులు జిల్లాలో ఆకాశం పొడిగా ఉండి, అక్కడక్కడ చెదురుపాటి వర్షం కురిసే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గరిష్ట ఉష్ణోగ్రతలు ఐదు రోజులు 35.1 నుంచి 36.3 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 25.7 నుంచి 27.3 డిగ్రీలు ఉంటుందని ఆమె పేర్కొన్నారు. గాలిలో తేమ శాతం ఉదయం 73 నుంచి 78 వరకూ, మధ్యాహ్నం 68 నుంచి 73 వరకూ, గాలి గంటకు 8 నుంచి 9 కిలోమీటర్లు వీస్తుందన్నారు.

భారీ వర్షం.. సేదతీరిన జనం

చోడవరం: మండుతున్న ఎండలతో అల్లాడిపోతున్న చోడవరం ప్రజలకు మంగళవారం కురిసిన వర్షం ఊరట కలిగించింది. మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమైంది. ఈదురుగాలులతో వాతవరణమంతా చల్లబడిపోవడంతో ఉక్కపోతతో ఇళ్లలో ఉండిపోయిన జనమంతా బయటకు వచ్చి కాస్త సేదదీరారు. అంతలోనే పెద్ద వర్షం కురిసింది. సుమారు గంట వరకు వర్షం పడింది. దీంతో ఎండవేడితో అల్లాడిపోయిన ప్రజలు ఈ వర్షంతో ఊరట చెందారు. మరోవైపు ఈదురుగాలులకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. చోడవరం పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో జనం ఇబ్బంది పడ్డారు. ఈదురుగాలులు, భారీ వర్షానికి మామిడి పంట దెబ్బతింది. పక్వానికి వచ్చిన మామిడి కాయలు నేలరాలాయి. దీంతో మామిడి రైతులు తీవ్ర ఆందోళన, ఆవేదన వ్యక్తం చేశారు.


చోడవరంలో కురుస్తున్న వర్షం

రోలుగుంటలో జలమయమైన వీధులు

రోలుగుంట: మండలంలో పలు గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. జీడి మామిడి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. రోలుగుంటలో లోతట్టు వీధులు జలమయమయ్యాయి. బందారు వీధి, అల్లువారి వీధి, మరి కొన్ని వీధుల్లో వర్షపు నీరు పోయే మార్గం లేక గృహాలు నీటమునిగాయి. ఆయా కుటుంబీకులు బకెట్లతో నీరు తోడి బయటకు తరలించారు. కాలువల్లో సజావుగా నీరు ప్రవహించేలా పూడిక తీయాలని గ్రామస్తులు కోరారు.

క్లుప్తంగా

దామాషా పద్ధతిలో బీసీలకు రిజర్వేషన్


సన్నిబాబుకు నియామక పత్రం అందిస్తున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు

అనకాపల్లి: దామాషా పద్ధతిలో బీసీలకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు డిమాండ్ చేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి విజయ రెసిడెన్సీలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా బీసీల కులగణన జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక సంస్థల్లో మన రాష్ట్రంలో 34 శాతం రిజర్వేషన్ ఉంటే, దీనిని కూటమి ప్రభుత్వం 24 శాతానికి కుదించడం అన్యాయమన్నారు. రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలన్నారు. రాష్ట్రంలో దశలవారీగా జిల్లా బీసీ కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ఏడాది జూన్‌లో విజయవాడలో రాష్ట్ర బీసీ సభ జరుగుతుందన్నారు. అనంతరం అనకాపల్లి బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా మొల్లి సన్నీబాబుకు నియామక పత్రాన్ని అందజేశారు. సంఘం రాష్ట్ర కన్వీనర్ అవుల నరసింహారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు బోయిన భానుమూర్తియాదవ్, కిల్లాడ అప్పలరాజు, రాష్ట్ర కార్యదర్శి బంధం పైడిరాజు, జిల్లా బీసీ నాయకులు జి.అప్పారావు, రెడ్డి రాము పాల్గొన్నారు.

మూడు చోరీ బైక్‌ల స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న మోటారు బైక్‌లు

పాయకరావుపేట చోరీకి గురైన మూడు మోటారు బైక్‌లను స్వాధీనం చేసుకొన్నట్టు సీఐ జి.అప్పన్న తెలిపారు. పాయకరావుపేట, యు.కొత్తపల్లి, యలమంచిలి పోలీసు స్టేషన్ల పరిధిలో అపహరణకు గురైన మూడు మోటారు బైక్‌లను స్వాధీనం చేసుకుని, నిందితుడు అనివెల్లి కిషోర్ కుమార్‌ను అరట్లకోట సమీపంలో అరెస్టు చేసినట్టు సీఐ జి.అప్పన్న తెలిపారు. నిందితుడిని యలమంచిలి కోర్టుకు తరలించామన్నారు.

బాణసంచా కేంద్రాల తనిఖీ

సబ్బవరం: అనుమతుల్లేకుండా బాణసంచా తయారు చేసేవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ హెచ్చరించారు. అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన తీవ్ర విషాదం నేపథ్యంలో మండలంలోని పలు బాణసంచా తయారీ కేంద్రాలను సీఐ పిన్నింటి రమణ, అగ్నిమాపక అధికారి జీవీ సత్యరాజుతో కలిసి మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అంతకాపల్లి, గుల్లేపల్లి, మల్లునాయుడుపాలెం, గంగవరం గ్రామాల్లోని బాణసంచా తయారీ కేంద్రాలతో పాటు, వారి నివాసాల్లో కూడా విస్తృత సోదాలు చేశారు. గుల్లేపల్లిలోని దాసరి పెంటయ్య ఇంట్లో నిల్వచేసిన జువ్వల తయారీకి వినియోగించే పుల్లలను తగలబెట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో తాత్కాలిక కోర్టు అనుమతులతో నాలుగు బాణసంచా తయారీ కేంద్రాలు నడుస్తున్నాయని, అయితే ప్రభుత్వ ఆదేశాలతో ప్రస్తుతం ఆ అనుమతులు కూడా రద్దయినట్లు పేర్కొన్నారు. ఇకపై ఎటువంటి బాణసంచా తయారుచేసినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.


గుల్లేపల్లిలో దాసరి పెంటయ్యకు చెందిన బాణసంచా కేంద్రంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

బాణసంచా తయారీ కేంద్రాల యజమానులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. తనిఖీల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వీరయ్య, వీఆర్వోలు, అగ్నిమాపక సిబ్బంది రుక్మిణి, ముత్యాలనాయుడు, భూషణం, బెన్వర్ తదితరులు పాల్గొన్నారు.

మంచినీరు ఇవ్వండి మహాప్రభో!

రావికమతం: తాగడానికి మంచినీరు ఇవ్వండి సారూ...అని చీమలపాడు పంచాయితీ అజేయపురం గ్రామానికి చెందిన ఆదివాసి గిరిజన మహిళలు వాటర్ ట్యాంక్ ఎక్కి ఖాళీ బిందెలతో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. అజేయపురం గ్రామంలో 30 కుటుంబాలు గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. 2023 సంవత్సరంలో జల్‌జీవన్ మిషన్ ద్వారా 15 లక్షల రూపాయలతో వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు ప్రారంభించి ఇంటింటికి కుళాయిలు వేయడానికి పైప్‌లు వేశారు. కానీ వాటర్ ట్యాంక్ పని అసంపూర్తిగా మిగిలిపోయింది. ఈ సమస్యపై 2024 డిసెంబర్ మొదటి వారంలో అజేయపురం గ్రామానికి రోడ్డు శంకుస్థాపన చేయడానికి వచ్చిన అనకాపల్లి పార్లమెంట్ సభ్యుడు సి.ఎం. రమేష్, చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజు దృష్టికి తీసుకొచ్చామని గిరిజనులు తెలిపారు. 15 రోజుల్లో పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు, హామీ ఇచ్చిన నాలుగు నెలలు పూర్తయినా వాటర్ ట్యాంక్ పనులు ప్రారంభం కాలేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. 2019 సంవత్సరంలో 15వ ఆర్థిక నిధుల నుంచి 5 లక్షల రూపాయలు ఖర్చు పెట్టి గ్రామానికి కిలోమీటర్ దూరంలో బోరు తీసి పైపులైన్ ద్వారా గ్రామానికి నీరు సరఫరా చేసేవారు. కొద్ది రోజుల తరువాత మోటారు కాలిపోవడంతో ఊట గెడ్డ ద్వారా నీరు తెచ్చుకొనేవారమని, వాటర్ ట్యాంక్ పనులు పూర్తయి తాగడానికి నీరు వస్తుందని ఆశగా ఎదురు చూశామని, కానీ మోటర్ పని కాక, ట్యాంక్ పనులు పూర్తి కాక ఇబ్బందులు పడుతున్నామన్నారు. తక్షణమే అధికారులు స్పందించి మోటర్ బాగు చేయించి, ట్యాంక్ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం కార్యవర్గ సభ్యులు గోవిందరావు, పాంగి జస్వంతి, పాంగి శ్రీరామ, చంద్రయ్య పాల్గొన్నారు.


వాటర్ ట్యాంక్ ఎక్కి ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజన మహిళలు

సమస్యలపై డీఈవోకు ఫ్యాప్టో వినతి

అనకాపల్లి: పదో తరగతి పరీక్ష పేపర్ల మూల్యాంకనానికి హాజరు కాలేని ఉపాధ్యాయులకు ఇచ్చిన షోకాస్ నోటీసులను వెనక్కి తీసుకోవాలని జిల్లా ఫ్యాప్టో చైర్మన్ బోయిన చిన్నారావు కోరారు. ఈ మేరకు కేఎస్ఆర్ పేటలోని డీఈవో కార్యాలయంలో డీఈవో గిడ్డి అప్పారావునాయుడుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఐఎస్‌లోని తప్పులను సరిచేయడానికి ఎంఈవో లాగిన్‌లో అనుమతించాలని, మే నెలలో జరగబోయే పదోన్నతుల సీనియార్టీ జాబితాను మెరిట్ కం రోస్టర్ విధానంలో రూపొందించాలని కోరారు. పదో తరగతి మూల్యాంకనంలో పాల్గొన్న ఉపాధ్యాయులకు రెమ్యునరేషన్‌ను వెంటనే చెల్లించాలని, జీవో నంబర్ 117ను పూర్తిగా రద్దు చేసి పాత పద్ధతిలోనే పాఠశాల వ్యవస్థను కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా ప్రధాన కార్యదర్శి యేశపోగు సుధాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.


డీఈవో గిడ్డి అప్పారావు నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో జిల్లా చైర్మన్ బోయిన చిన్నారావు

పౌష్టికాహారమే తల్లీబిడ్డకు శ్రేయస్కరం


గర్భిణులకు సీమంతాలు చేస్తున్న పీడీ కె.అనంతలక్ష్మి

అనకాపల్లి: గర్భిణులు ప్రభుత్వ వైద్యుల పర్యవేక్షణలో ఉండాలని, పౌష్టికాహారం తీసుకోవడం వల్ల తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని జిల్లా మెడికల్ ఇమ్యునైజేషన్ అధికారి చంద్రదేవ్, జిల్లా మహిళా సంక్షేమ శాఖ పీడీ కె.అనంతలక్ష్మి అన్నారు. స్థానిక గాంధీనగరం ఎస్ఆర్ శంకరన్ సమావేశ హాల్లో పోషణ పక్వాడ జిల్లా స్థాయి సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ బిడ్డ జన్మించిన వెంటనే తల్లిపాలు పట్టాలన్నారు. జిల్లా వన్‌స్టాప్ ఎస్ఐ రాములమ్మ మాట్లాడుతూ శక్తియాప్‌ను మహిళలు అందరూ తమ సెల్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి నాగ శిరీష, నోడల్ అధికారి ఎల్.సుజాత, సీడీపీవో కె.ప్రభావతి, వి.లలితకుమారి, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఇరువురి అరెస్టు

ఎస్.రాయవరం: గంజాయి కేసులో తప్పించుకుని తిరుగుతున్న ఇద్దరిని అడ్డురోడ్డు సమీపంలో అరెస్టు చేసి, కారు స్వాధీనం చేసుకున్నట్టు నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని అడ్డురోడ్డు సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు. జనవరి 2న అడ్డురోడ్డు సమీపంలో స్విఫ్ట్ కారులో 110 కేజీల గంజాయితోపాటు ఇద్దరిని అరెస్టు చేశామన్నారు. తాజాగా ఇదే కేసులో నిందితులుగా ఉన్న మరో ఇద్దరు సువాన్‌లాక్‌సింగ్, కదంసింగ్‌లను అరెస్టు చేసినట్టు చెప్పారు. వీరి కూడా రాజస్థాన్ చెందినవారన్నారు. రాజస్థాన్ నుంచి వచ్చి ఉమ్మడి విశాఖ జిల్లాలో పలు రకాల వ్యాపారాల పేరిట స్థావరాలు ఏర్పాటు చేసుకుని గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నారన్నారు. నిందితులను అరెస్టు చేయడంలో కీలకం వ్యవహరించిన నక్కపల్లి సీఐ రామకృష్ణ, ఎస్.రాయవరం ఎస్ఐ విభీషణరావులను అభినందించారు.

అభాగ్యుడికి ఆసరా

- చెట్టుపై నుంచి పడిన వ్యక్తికి రూ.3,32,862 నగదు అందజేత
- మానవత్వం చాటుకున్న గండేపల్లి సునీల్‌కుమార్ మిత్ర బృందం

మునగపాక: పక్కోడు ఏమైపోతే మనకెందుకులే అనుకున్న రోజులివి. అటువంటిది పేదరికంలో ఉన్న ఓ కుటుంబానికి తోటి స్నేహితుల ద్వారా నగదు పోగు చేసి అందించి తన మానవత్వం చాటుకున్నాడు గండేపల్లి సునీల్‌కుమార్. మునగపాక బీసీ కాలనీలో నివాసం ఉంటున్న గండేపల్లి సునీల్‌కుమార్ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటారు. లక్షకు పైగా ఫ్యాయర్స్‌ను సంపాదించుకున్నారు. నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లుకు చెందిన దొంగల శ్రీను ఇటీవల చెట్టుపై నుంచి కిందపడి గాయాలపాలైన సంగతి సునీల్ తెలుసుకున్నారు. పేదరికంలో ఉన్న శ్రీను కుటుంబానికి సాయం అందించాలని ఆలోచన చేశారు. తన స్నేహితులైన డేంజర్ బాయ్స్‌తో పాటు ఇతరులకు సోషల్ మీడియాలో శ్రీను కుటుంబానికి అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ సాయం చేయాలని అర్థించారు. ఇలా రూ.3,32,862 నగదును సేకరించారు. స్నేహితులతో కలిసి చినదొడ్డిగల్లు వెళ్లి శ్రీను కుటుంబ సభ్యులకు సంబంధిత సాయాన్ని అందజేశారు. ఇలా పిలుపునిచ్చిన వెంటనే ముందుకు వచ్చిన స్నేహితులతో పాటు సోషల్‌మీడియా ఫాలో అవుతున్న వారు స్పందించడంపై పలువురు అభినందిస్తున్నారు.


చెట్టుపై నుంచి కిందపడిన వ్యక్తికి సాయం అందిస్తున్న సునీల్ మిత్ర బృందం

మహిళ మెడలో పుస్తెలతాడు చోరీ

- యలమంచిలిలో పట్టపగలే కలకలం రేపిన చైన్ స్నాచింగ్

యలమంచిలి రూరల్ : పట్టణంలోని తులసీనగర్‌లో భూలోకమాంబ అమ్మవారి ఆలయానికి సమీపంలో రోడ్డుపై నడిచి వెళ్తున్న మహిళ మెడలో సుమారు మూడు తులాల బంగారు పుస్తెలతాడును ఇద్దరు గుర్తు తెలియని యువకులు లాక్కెళ్లిన ఘటన కలకలం రేపింది. ఈ కాలనీకి చెందిన పాలమరశెట్టి అరుణ(52) స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి వైద్యం నిమిత్తం వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తుండగా భూలోకమాంబ ఆలయం పక్కన ఒక లాండ్రీ బండి వద్ద ఒక యువకుడు స్కూటీపై కూర్చుని మొబైల్ మాట్లాడుకుంటున్నట్టు నటిస్తుండగా మరో యువకుడు ఒక్కసారిగా నడిచి వెళ్తున్న అరుణ మెడలో బంగారు గొలుసును వెనుక నుంచి లాక్కొన్నాడు. మహిళ పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల కాలనీ వాసులు ఆ యువకుల్ని పట్టుకుందామనుకునే సరికే వేగంగా పరారయ్యారు. దీంతో ఈ సమాచారాన్ని పట్టణ పోలీసులకు అందించారు. అక్కడకు చేరుకున్న పట్టణ ఎస్ఐ, సిబ్బంది ఆ మార్గంలో భూలోకమాంబ ఆలయం వద్ద ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించగా అవి పనిచేయలేదు. స్టేట్ బ్యాంక్ పక్కనున్న బజాజ్ షోరూంలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించిన పోలీసులకు స్కూటీపై వేగంగా పరారవుతున్న నిందితులు కనిపించారు. నిత్యం రద్దీగా ఉండే తులసీనగర్‌లో పట్టపగలే బంగారు గొలుసు దొంగతనం జరగడం పట్టణంలో తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ గొలుసు లాక్కెళ్లిన ఘటనపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ కె. సావిత్రి మంగళవారం రాత్రి విలేకరులకు తెలిపారు. ఇటీవల రెండు నెలల క్రితం పట్టణంలోని గాజువాక బైపాస్ రోడ్డులో పాన్ షాపు వద్ద మహిళ మెడలో బంగారు గొలుసును ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు లాక్కెళ్లారు. అయితే మహిళ తీవ్రంగా ప్రతిఘటించడంతో బంగారు గొలుసులో కొంత భాగం ఆమె చేతిలోనే ఉండిపోయింది. ఈ ఘటనపై కేసు నమోదు చేయలేదు. గతంలో రెండేళ్ల క్రితం 16వ నెంబరు జాతీయ రహదారిపై ఓ మహిళ మెడలో బంగారు గొలుసును లాక్కెళ్లారు. ఏడాది క్రితం మండలంలోని కృష్ణాపురంలో నడిచి వెళ్తున్న మహిళ మెడలో గొలుసు కూడా ఇదే తరహాలో అపహరించుకుపోయారు. నిందితులను పోలీసులు పట్టుకోలేకపోవడంతో చైన్‌స్నాచర్లు రెచ్చిపోతున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు.


ఘటనను వివరిస్తున్న బాధితురాలు అరుణ


సీసీ కెమెరాలో నమోదైన చైన్ స్నాచర్లు పరారవుతున్న దృశ్యం

వరికోతలు వాయిదా వేసుకోవాలి

అనకాపల్లి : వర్షసూచన ఉన్నందున వరికోత దశలో ఉన్న వరిపైరుని కోయడం వాయిదా వేసుకోవాలని, ఒకవేళ ఇప్పటికే కోసి ఉంటే పనలను కుప్పలుగా వేసుకుని టార్పాలిన్ కప్పి జాగ్రత్త చేసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు సూచించారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం శాస్త్రవేత్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కోత దశలో ఉన్న రాగి, వేరుశనగ, నువ్వులు పంటలను కోయడం వాయిదా వేసుకోవాలన్నారు. కోసిన నువ్వులను నిల్వచేసుకునేటప్పుడు పురుగు పట్టకుండా కిలో నువ్వులకు 5 గ్రా. వేపాకుపొడి లేదా 5 మి.లీ వేప నూనె కలుపుకోవాలన్నారు. పొలంలో పూత దశలో ఉన్న నువ్వుల్లో ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు వేరు, కాండం కుళ్లు తెగులు ఆశించే అవకాశం ఉందని, కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా మాంకోజెబ్‌ను లీటరు నీటికి 3 గ్రా.ల చొప్పున కలిపి మొక్కల మొదళ్లు తడిచేల పిచికారి చేయాలన్నారు. చెరకు కార్శి, మొక్కతోటల్లో ఎరువు వేయాల్సిన రైతులు ఈ వర్షాలను ఉపయోగించుకుని ఎరువు వేయవచ్చన్నారు. 45 రోజులు కార్శి చేసిన తోటల్లో ఎకరాకు 150 కిలోల యురియా 45, 90 రోజుల వయసు గల మొక్కతోటల్లో అయితే 75 కిలోల యూరియాను మొక్కల మొదళ్ల దగ్గర చిన్న గుంతలు తీసి వేసుకోవాలన్నారు. వర్ష సూచన, గాలులు ఉండే అవకాశం ఉన్నందున, పక్వానికి వచ్చిన అరటి గెలలను వీలైనంత త్వరగా కోసి మార్కెట్‌కు తరలించాలని, ఇంకా పక్వానికి రాని అరటి గెలలు ఉంటే గాలులకు పడిపోకుండా ఊతమివ్వాలని కోరారు. కూరగాయలను వీలైనంత త్వరగా కోసి మార్కెట్‌కు తరలించాలని, కూరగాయ మొక్కలు గాలులకు పడిపోకుండా కర్రలతో ఊతమివ్వాలన్నారు. ఈ వర్షాన్ని ఉపయోగించుకుని ఖాళీగా ఉన్న పొలాల్లో వేసవిలోతు దుక్కులు దున్నుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు టి.శ్రీలత, రమణమూర్తి, వి.గౌరి, బి.భవాని, వి.చంద్రశేఖర్, ఎ.అలివేణి పాల్గొన్నారు.

పారిశ్రామికీకరణ దిశగా జిల్లా

- పరిశ్రమలలో భద్రత ప్రమాణాలు తప్పనిసరి
- కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసి, పరిశ్రమల స్థాపనకు అవసరమైన చర్యలు సత్వరమే తీసుకోవాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులకు తెలిపారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ(డీఐఈపీసీ) జిల్లా స్థాయి సమావేశం జరిగింది. గత సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలను అధికారులు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఏకగవాక్ష విధానం కింద 2,177 దరఖాస్తులు వివిధ శాఖల అనుమతి కోసం రాగా.. వాటిలో 2,077 దరఖాస్తులను ఆమోదించామన్నారు. పెండింగ్ దరఖాస్తుల అనుమతుల వివరాలను వివిధ శాఖల అధికారులతో మాట్లాడి నిర్ణీత సమయంలో ఆమోదించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 41 పరిశ్రమలకు సంబంధించిన వివిధ రాయితీల కోసం 121 దరఖాస్తులకు రూ.12.91 కోట్లు కమిటీలో ఆమోదం తెలిపామన్నారు. ప్రధాన మంత్రి ఉపాధి కల్పనా కార్యక్రమం, ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకాల అమలు తీరు, పురోగతిపై సమీక్షించారు. 2024 అక్టోబర్ 1 నుంచి ఇప్పటి వరకు మొత్తం 196 పరిశ్రమలకు 160 పరిశ్రమలను తనిఖీలు చేశామన్నారు. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక వసతుల కల్పనా సంస్థ(ఏపీఐఐసీ) కొత్తగా మంజూరు చేసే స్థలాలపై వివరాలు సేకరించామన్నారు. పరిశ్రమలలో భద్రత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో షేక్ ఆయిషా, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ వి.ఆది శేషు, ఏపీఐఐసీ జీఎం ఎస్.నరసింహారావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ ముకుందరావు, జిల్లా రిజిస్ట్రార్ మన్మథరావు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఆర్.వెంకటరమణ, జిల్లా రవాణా శాఖ అధికారి మనోహర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

రాష్ట్రస్థాయి ప్రశంసాపత్రాలకు ఐదుగురు జిల్లా కళాకారులు


పి.ముత్యాలనాయుడు


పి.సి.హెచ్.నాయుడు


దేవాతుల శివాజీ


బర్నికం రామారావు


భాను

అనకాపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో తెలుగు నాటక రంగ దినోత్సవం సందర్భంగా బుధవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జిల్లా నుంచి ఐదుగురు కళాకారులు నగదు, ప్రశంసా పత్రాలను అందుకోనున్నారని విశ్రాంత ఉపాధ్యాయుడు కె.ఎం.నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన పి.ముత్యాలరావు, పెద్దిశెట్టి రామారావు, డి.శివాజీ, పి.సి.హెచ్.నాయుడు, మడకా భానులకు ఒక్కొక్కరికి రూ.10వేలు, ప్రశంసాపత్రం అందుకుంటారని తెలిపారు.

8 కిలోల గంజాయి పట్టివేత


గంజాయితో పట్టుబడ్డ నిందితులతో రావికమతం పోలీసులు

రావికమతం: మండల కేంద్రంలో 8 కిలోల గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని మంగళవారం రావికమతం పోలీసులు పట్టుకున్నారు. రావికమతం ఎస్ఐ రఘువర్మ తెలిపిన వివరాల మేరకు అనుమానాస్పందంగా సంచరిస్తున్న తమిళనాడుకు చెందిన మురుగున్, తంగం(ఆడ) రావికమతం శివారులో రెండు బ్యాగ్‌లతో 8 కిలోల గంజాయిని తరలిస్తుండగా పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. పాడేరు ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయి తీసుకొచ్చి తమిళనాడుకు తరలించేందుకు సిద్ధంగా ఉన్నారని, వీరిద్దరిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని ఎస్ఐ తెలిపారు.

నువ్వు పంటలో యాజమాన్య పద్ధతులు లాభదాయకం

తుమ్మపాల: సమగ్ర యాజమాన్య పద్ధతులను సరైన సమయంలో పాటించడం ద్వారా నువ్వు పంటలో మెరుగైన దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహన్‌రావు అన్నారు. మండలంలోని దిబ్బపాలెం గ్రామంలో మంగళవారం బీసీటీ-కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నువ్వు పంటపై నిర్వహించిన క్షేత్ర దినోత్సవం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వచ్చే తొలకరి కాలంలో అన్ని రకాల ధాన్యాలు, పప్పు గింజలు, నూనె గింజలు కలిపి ప్రతి రైతు తన పొలంలో చల్లుకోవడం ద్వారా అన్ని రకాల పోషకాలు నేలకు అందుతాయన్నారు. బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజకుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో నూనె గింజల పంటల ఆదర్శ గ్రామాలుగా దిబ్బపాలెం, వెంకుపాలెంలను ఎంపిక చేశామన్నారు. నువ్వు, వేరుశనగ, ప్రొద్దు తిరుగుడు వంటి పంటలను సమగ్ర యాజమాన్య పద్ధతుల ద్వారా సాగు చేయాలని సూచించారు. గ్రామంలో 152 మంది రైతులకు నువ్వుల విత్తనాలు అందజేశామని సస్య రక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్ తెలిపారు. అంతకు ముందు రైతులు బొద్దపు భవాని, గోవిందు పొలంలో పంట కోత ప్రయోగాన్ని నిర్వహించి మొక్కల సాంద్రత, కాయల సంఖ్య, దిగుబడి శాతాన్ని లెక్కించారు. భూసార శాస్త్రవేత్త బుర్ల శ్రీహరిరావు, దిబ్బపాలెం సర్పంచ్ పీలా ఉష, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి తులసీమణి, గ్రామ వ్యవసాయ సహాయకుడు గణేష్, ప్రకృతి వ్యవసాయ రైతులు విల్లూరి వీరునాయుడు, విల్లూరి శ్రీను, మల్ల నాగేశ్వరరావు, స్వాతి, మహాలక్ష్మి పాల్గొన్నారు.


దిబ్బపాలెంలో నువ్వుల పంట కోత ప్రయోగాన్ని లెక్కిస్తున్న అధికారులు

షైనింగ్ స్టార్‌కు సన్మానం


విద్యా శాఖ మంత్రి లోకేష్ నుంచి పురస్కారాన్ని అందుకుంటున్న విద్యార్థిని రాజులమ్మ

కశింకోట : మండలంలోని తేగాడలో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో చదివి ఈ ఏడాది ఇంటర్ బైపీసీలో రాష్ట్రంలోని కస్తూర్బా విద్యాలయాల్లోనే టాపర్‌గా వెయ్యికి 983 మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని కంట్రెడ్డి రాజులమ్మ ఆంధ్రప్రదేశ్ సన్‌షైన్ స్టార్ పురస్కారాన్ని మంగళవారం అందుకున్నారు. ఈ మేరకు అమరావతిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ పురస్కారంతోపాటు ల్యాప్‌ట్యాప్‌ను అందజేశారు.

క్లుప్తంగా

పార్కుల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం



వృద్ధులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు జానకీరామరాజు

అనకాపల్లి: వేసవి దృష్టిలో పెట్టుకుని పార్కుల్లో ఉదయం, సాయంత్రం సమయంలో అన్ని వర్గాల ప్రజలు, విద్యార్థులు కూర్చోనేందుకు పరిశుభ్రం చేయిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు అన్నారు. స్థానిక గాంధీనగరం మహాత్మాగాంధీ ఉద్యానవనంలో వృద్ధులు, అక్కడ సందర్శకులతో మంగళవారం ఆయన మాట్లాడారు. పరిశుభ్రమైన వాతావరణంలో పార్కులు ఉండే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. 82వ వార్డు పరిధిలో సమస్యలు ఏమైన ఉన్నట్లయితే కార్పొరేటర్ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌ఐ మణికుమారి

అనకాపల్లి టౌన్: మండలంలోని కూండ్రం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై శక్తి టీమ్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రూరల్ ఏఎస్‌ఐ మణికుమారి మాట్లాడుతూ ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులు ప్రతీ విషయాన్ని సున్నితంగా గమనించాలన్నారు. తల్లిదండ్రులతో స్నేహంగా మెలగాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు కారణంగా బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండబోదని ఏపీఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. రామకృష్ణ తెలిపారు. నరసింగబిల్లితోపాటు జెట్టపురెడ్డితుని, ఎన్‌జీపాలెం, ఏనుగుతుని, అచ్యుతాపురం, చింతలపాలెం, గొబ్బూరు, చింతలపాలెం, తాళ్లపాలెం, బంగారయ్యపేట, ఉగ్గినపాలెం, పరవాడపాలెం, జమాదులపాలెం, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, పేరంటాలపాలెం, గంటవానిపాలెం, ఏఎస్ పేట, సోమవరం, చిన ఏనుగుతుని, అచ్చెర్ల, మోసయ్యపేట పంచాయతీల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వ్యవసాయ రంగానికి ఉదయం 4 నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు గమనించి తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 2,278 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్టధర	గరిష్టధర
స్పెషల్ రకం	4,410	4,570
మొదటి రకం	3,790	4.380
రెండో రకం	3,270	4,080
మూడో రకం	3,000	3,250

అనకాపల్లి సినిమాలు

రాజా :మాడ్ స్క్వేర్
సత్యనారాయణ స్క్రీన్-1: గుడ్ బ్యాడ్ అగ్లీ
సత్యనారాయణ స్క్రీన్-2 : రాజుగారి దొంగలు
పర్తిసాయి :కోర్టు
షిర్డీసాయి :అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి
వెంకటేశ్వర : చెరసాల
శ్రీసత్య :సంక్రాంతికి వస్తున్నాం.
రామచంద్ర :జాక్

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 32 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-06 యూనిట్లు , బీ పాజిటివ్-09, ఓ పాజిటివ్-15, ఏబీ పాజిటివ్-02 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 359 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 297 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

సర్వే మావల్ల కాదు

సర్వేల పేరుతో పంచాయతీ కార్యదర్శులపై ఒత్తిడి

మానసికంగా కుంగిపోతున్న వైనం

లక్ష్యాలు పెట్టి సెలవు దినాల్లోనూ పని

తాజాగా మన మిత్ర సర్వే బాధ్యత



గ్రామ సచివాలయ భవనం

తుమ్మపాల: ఎన్నికల హామీలను అమలు చేయడం చేతకాక... కాదు కాదు ప్రజలకు మంచి చేయడం ఇష్టం లేని సీఎం చంద్రబాబునాయుడు విజన్ -2048 అంటూ తప్పుదోవ పట్టించడం ఒక ఎత్తయితే... వారికి ఏదో చేస్తున్నట్లు క్షేత్రస్థాయిలో సర్వేల పేరుతో చేస్తున్న హంగామా మరో ఎత్తుగా కనిపిస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చి దాదాపు 10 నెలలు కావస్తున్నా ఒక్క పథకం కూడా ప్రజలకు అందించకుండా చేస్తున్న కాలయాపనతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందన్న సంగతి అందరికీ తెలిసిందే. దీంతో ప్రజలకు ఇప్పటికైన పథకాలు అందించి మాట నిలబెట్టుకోవాలన్న తపన కూటమి ప్రభుత్వంలో కనిపించడం లేదు. సర్వేల పేరుతో ప్రజల ఆస్తులు, ఇళ్లలో వస్తువులను సైతం లెక్కకట్టి మరో ఎత్తుగడకు శ్రీకారం చుట్టింది. ప్రజల పూర్తి సమాచారం రాబట్టడమే ధ్యేయంగా చేపడుతున్న సర్వేలను గ్రామస్థాయిలో పూర్తి బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై పెట్టడంతో వారు సకల సర్వేల అధికారిగా తీవ్ర పని ఒత్తిడికి గురవుతున్నారు.

సర్వేలతో సతమతం..

కూటమి ప్రభుత్వం అనాలోచిత **నిర్ణ యాలతో** మొదలుపెట్టిన **సర్వేలు పం** చాయతీ కార్యదర్శులపై తీవ్ర **పనిఒత్తిడిగా** మారాయి. సెలవులు కూడా **లేకుండా లక్ష్యాలు** పెట్టి మరీ మానసిక వేదనకు గురిచేస్తున్నారు. పనిభారం పెంచి టార్గెట్లు విధించి జిల్లా, మండల స్థాయి అధికారుల ద్వారా తీవ్రంగా వేధిస్తుండటంతో కార్యదర్శులు బలైపోతున్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులను జవాబుదారీగా చేస్తూ మిస్సింగ్ సిటిజల్స్ సర్వే, మిస్సింగ్ ఎంప్లాయీస్ సర్వే, వర్క్ ఫ్రమ్ హోం, హౌస్ హోల్డు జియో ట్యాగింగ్, పీ4 సర్వే, డెత్ రీ వెరిఫికేషన్ సర్వే, పీపీఎస్ సర్వే, 0-6 సంవత్సరాల పిల్లల ఆధార్ మిస్సింగ్ సర్వే, నాన్ ఏపీ రెసిడెన్సి సర్వే, ఇంటి పన్నులు, కుళాయి పన్నుల వసూళ్లతోపాటు ఆయా సర్వేలపై ఐవీఆర్ కాల్స్ ద్వారా ప్రజాభిప్రాయాలు సేకరించి చిన్న విషయానికి కూడా కార్యదర్శులను వివరణలు అడుగుతుండటంతో వారంతా సతమతమైపోతున్నారు. అంతిమంగా ఈ పని భారం మొత్తం ప్రోగ్రెస్ రూపంలో పంచాయతీ కార్యదర్శులపై పడి వారు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు.

మన మిత్ర కూడా కార్యదర్శుల బాధ్యతే...

ఇప్పటికే పలు రకాల సర్వేలతో లబోదిబోమంటున్న కార్యదర్శులకు అదనంగా కూటమి ప్రభుత్వం ఇంటింటికి మన మిత్ర పథకాన్ని జోడించింది. ఈ నెల 15వ తేదీ నుంచి ప్రతి ఇంటికి మన-మిత్ర పథకం చేరాలని, ఇంటిలో అందరి మొబైల్ ఫోన్ నుంచి మన-మిత్ర వాట్సాప్ సేవలను వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులకు అప్పగించారు. వీటితో పాటు పీజీఆర్ఎస్ ఫిర్యాదుదారుల వద్దకు వెళ్లి అర్జీల పరిష్కారంపై యాప్‌లో అభిప్రాయం రికార్డ్ చేయడం, ఫొటోతో పాటు ఐరిస్ సేకరించే పనులను వారికే అప్పగించి సకల సర్వేల అధికారిగా మార్చేశారు.

దీర్ఘకాలిక సెలవుల యోచనలో కార్యదర్శులు

మండలంలో 26 గ్రామ సచివాలయాలకు **కార్యదర్శులు** ఉన్నారు. వారిలో గ్రేడ్-5 పది **మంది కార్యద**ర్శులు ఒక్కో గ్రామ సచివాల**యానికి ఉన్నా**రు. గ్రేడ్-4 కార్యదర్శులు ఐదు**గురు మాత్రమే** ఉండటంతో వారికి ఒక్కొక్క**రికి మూడు** పంచాయతీలు, ఐదు సచివాల**యాలు చొప్పు**న విధులు అప్పగించారు. **తుమ్మపాల మే**జర్ పంచాయతీ కార్యదర్శి **పని ఒత్తికి తో**డు సర్వేల బాధపడలేక దీర్ఘ**కాలిక సెలవుల్లో**నే ఉన్నారు. దీంతో మిగిలిన గ్రామాల కార్యదర్శులు కూడా మూకుమ్మడిగా దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడానికి సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

స్పీడ్ బ్రేకర్స్ వల్ల ప్రమాదాలు



స్టేషన్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న హరనాథ్‌బాబు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని విజయరామరాజు పేట అండర్ బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్స్ వల్ల వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ కొణతాల హరినాథ్‌బాబు తెలిపారు. స్థానిక స్టేషన్ సూపరింటెండెంట్ సత్యనివాస్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్వారీల వేగాన్ని తగ్గించడానికి రైల్వే శాఖ రోడ్డుకు ఇరువైపులా మూడు స్పీడ్ బ్రేకర్లు వేసిందన్నారు. దీని వల్ల ఆటోలు, ద్విచక్ర వాహనదారులకు వెన్నుముఖ సమస్యలు వస్తున్నాయని తెలిపారు. 108 వాహనాలలో వెళ్లే రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ ప్రాంతంలో ఒక్క స్పీడ్ బ్రేకర్ ఉంచితే క్వారీల వేగాన్ని తగ్గించవచ్చని తెలిపారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు.

20 మద్యం సీసాల స్వాధీనం

కశింకోట: మండలంలోని లాలంకొత్తూరు గ్రామంలో అక్రమంగా గోనె సంచిలో తరలిస్తున్న 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పి. మనోజ్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా కొండపు సత్యనారాయణ(42)ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పట్టణంలో అకాల వర్షం



పట్టణంలో కురుస్తున్న వర్షం



కశింకోట వద్ద కురుస్తున్న వర్షం

అనకాపల్లి టౌన్: పట్టణంలో మంగళవారం సాయంత్రం కురిసిన వర్షంతో ప్రజలు సేదతీరారు. ఉదయం నుంచి భానుడు ప్రతాపాన్ని చూపించడంలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం మూడు గంటల వరకు 34.3 డిగ్రీల సెల్సియస్‌తో ఎండ మండిపోగా, ఆ తర్వాత ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమైంది. సుమారు అరగంటకు పైగా కురిసిన వర్షపాతం 13.3 మి.మీలుగా నమోదైంది. దీంతో పనులపై వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ అకాల వర్షాల వల్ల మామిడి, జీడి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు.

కశింకోట: మండలంలో మంగళవారం సాయంత్రం పెను గాలితో వర్షం కురిసింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఆకస్మికంగా ఆకాశం మేఘావృతమై కొంతసేపు పెను గాలి వీచింది. ఆ తర్వాత వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది. వర్షంతోపాటు వీచిన గాలుల వల్ల మామిడి కాయలు రాలి పంటకు నష్టం ఏర్పడిందని రైతులు వాపోయారు. విద్యుత్ సరఫరాకు సుమారు గంటపాటు అంతరాయం కలిగింది. దీంతో విద్యుత్ సిబ్బంది వర్షం తగ్గాక మరమ్మతులు చేపట్టి పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు.

26న హనుమాన్ శోభాయాత్ర



శారదానది ఒడ్డు పరిసరాలను పరిశీలిస్తున్న పరమేశ్వరరావు, కుమారస్వామి

అనకాపల్లి: హనుమాన్ శోభాయాత్ర ఈ నెల 26న మధ్యాహ్నం 3 గంటలకు సుంకరమెట్ట జంక్షన్ నుంచి మండలంలో కొత్తూరు ఏఎంఏఎల్ కళాశాల జంక్షన్ వరకూ నిర్వహించనున్నట్లు రాష్ట్రీయ స్వయం సేవక్ సభ్యుడు ద్వారపరెడ్డి పరమేశ్వర రావు, వినాయక విగ్రహ నిమజ్జనోత్సవ కమిటీ చైర్మన్ ఆడారి కుమారస్వామి తెలిపారు. స్థానిక శారదానది ఒడ్డున గంగాహారతి ఇచ్చేందుకు మంగళవారం వారు ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హనుమాన్ దేవాలయం వరకు వేల సంఖ్యలో హిందువులు జైశ్రీరామ్ అనే నామస్మరణతో ఈ యాత్రలో పాల్గొంటారన్నారు. సాయంత్రం ఆరు గంటలకు శారదానది ఒడ్డున హనుమాన్ హారతి ఇస్తారన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా సభ్యులు నడిపూరి అనిల్ కుమార్, ఏసీహెచ్ బాలు, జేపీ కొండలరావు, కొణతాల అప్పలరాజు, ఆడారి రాజు, కొణతాల హరినాథ్ బాబు, డీవీ రాజేష్, ఆళ్ల గౌతమ్ పాల్గొన్నారు.

కొండలు పిండేస్తున్నా.. పట్టని అధికారులు

రేయింబవళ్లు ఇష్టానుసారంగా గ్రావెల్ తవ్వకాలు



తోటాడ త్రిమూర్తుల ఆలయ సమీపంలో యంత్రంతో కొండను తవ్వేస్తున్న దృశ్యం



గ్రావెల్ తరలిస్తున్న ట్రాక్టర్లు

మునగపాక: కూటమి అధికారాన్ని అడ్డం పెట్టుకుని అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. మండలంలో కొండలను పిండేసి గ్రావెల్ తరలించి లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారు. ఈ విషయంలో రెవెన్యూ, మైన్స్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. మండలంలోని తోటాడ త్రిమూర్తుల ఆలయ సమీపంలోని మరిడిమాంబ గుడిని ఆనుకొని యంత్రాలతో గ్రావెల్‌ను తవ్వేస్తున్నారు. రేయింబవళ్లు అనే తేడా లేకుండా ఇష్టానుసారంగా గ్రావెల్ తరలిస్తున్నారు. కొండలు తవ్వేయడంతో పర్యావరణానికి హాని కలుగుతుందంటూ అధికారులు ప్రకటనలు చేయడం తప్పా అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయడం లేదు. గ్రావెల్ తరలింపును నిరోధించాల్సిన మైన్స్, రెవెన్యూ అధికారులు మిన్నకుండిపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. గ్రావెల్ తరలింపు వెనుక తోటాడ పంచాయతీ పరిధిలోని అధికార పార్టీకి చెందిన నేత హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. గ్రావెల్ అక్రమ తరలింపునకు సంబంధించి తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు, పాటిపల్లి వీఆర్వోల వివరణ కోరేందుకు ఫోన్ చేయగా, రెస్పాన్స్ లేదు. ఉన్నతాధికారులు స్పందించి గ్రావెల్ అక్రమ తరలింపునకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



అలరించిన పిల్లల సాంస్కృతిక ప్రదర్శన



ఆకట్టుకున్న బుర్రకథ

మునగపాక: స్థానిక బీసీ కాలనీలో సోమవారం రాత్రి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంబేడ్కరిజమ్ పునాది అసోసియేషన్ కన్వీనర్ రాజాన బుజ్జిబాబు, బీచ్ బాయ్స్ ఆధ్వర్యంలో పలువురు నేతలు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం, బుర్రకథ, రంగుల రాట్నం, సినీ హీరోల డూప్ డ్యాన్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. వేడుకలను తిలకించేందుకు వచ్చిన వారందరికీ నిర్వాహకులు మిఠాయిలు, ఐస్‌క్రీమ్స్ అందజేశారు.

గ్రామాల్లో ఎక్కడి పనులు అక్కడే..

సర్వసభ్య సమావేశంలో సభ్యుల ధ్వజం



మాట్లాడుతున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు



సమావేశానికి హాజరైన సభ్యులు



ఎంపీటీసీలు కనకారావు, నాగేశ్వరరావుల మధ్య వాగ్వాదం

అనకాపల్లి టౌన్: తాగునీరు లేదు.. పారిశుధ్యం కానరాదు.. ఎక్కడి పనులు అక్కడే.. బిల్లులు మంజూరు కావడంలేదు.. 16వ మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు ధ్వజమెత్తారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు అధ్యక్షతన స్థానిక మండల సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన సమావేశంలో పలువురు సభ్యులు గ్రామాల్లో అభివృద్ధి పనులు ఏవీ జరగడం లేదని గగ్గోలు పెట్టారు. తుమ్మపాల మేజర్ పంచాయతీలో పారిశుధ్య నిర్వహణలో అవకతవకలు జరిగాయని ఎంపీటీసీ-2 పంచదార్ల కన్నారావు, ఎంపీటీసీ-5 చదరం నాగేశ్వరరావు పరస్పర తీవ్ర ఆరోపణలు చేసుకున్నారు. ఇరువురి మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. గ్రామంలోని చెత్తను ఎత్తేందుకు ఒక్క రిక్షా కూడా లేదని విమర్శించారు. ఈ విధంగా పాలన కొనసాగుతుందని ఇరువురు విమర్శించారు. దీనిపై ఎంపీపీ బదులిస్తూ ప్రతీ గ్రామానికి రిక్షాలను కొనడానికి మండల పరిషత్ నుంచి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. మేజర్ పంచాయతీలైన తుమ్మపాల, కొత్తూరుతో పాటు సత్యనారాయణపురం, బట్లపూడి, మూలపేట, మార్టూరు తదితర గ్రామాల్లో తీవ్ర నీటి ఎద్దడి నెలకొందని వాపోయారు. గ్రామాలలో తిరగలేక పోతున్నామన్నారు. ఒక్క కార్యదర్శి అందుబాటులో ఉండడం లేదన్నారు. రోడ్లు అరకొరగా వేశారు. డ్రెయిన్లు నిర్మించలేదని, దీనివల్ల మురుగు పారే అవకాశం లేకుండా పోయిందన్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ప్రసాద్ స్పందిస్తూ వేసవి నుండి నీటి ఎద్దడిని ఎదుర్కొనడానికి పక్కా యాక్షన్ ప్లాన్ తయారు చేశామన్నారు. అయితే కాంట్రాక్టర్లు ఎవరూ పనులు చేయడానికి ముందుకు రావడం లేదన్నారు. సత్యనారాయణపురం సర్పంచ్ ప్రసన్న లక్ష్మీ మాట్లాడుతూ 12వ వీధిలో డ్రెయిన్ పారడం లేదని, కనీసం ఔట్‌లెట్ కూడా అధికారులు నిర్మించడంలేదన్నారు. సచివాలయాలలో, పంచాయతీ కార్యాలయాల్లో వీఆర్వోలు అందుబాటులో ఉండడం లేదని, దీని వల్ల విద్యార్థులకు ఉపయోగపడే సర్టిఫికెట్ల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వీరిని పట్టించుకొనే వారు లేరన్నారు. దీనిపై డిప్యూటీ తహసీల్దారు శ్రీరామూర్తి మాట్లాడుతూ మండల కార్యాలయంలో టైపిస్ట్, జూనియర్ అసిస్టెంట్ తదితర సిబ్బంది కొరత వల్ల ఆలస్యమవుతుందన్నారు. రెవెన్యూ శాఖపై జరిగిన చర్చలో గ్రామాల్లో ఎక్కడా రీ సర్వే జరగడం లేదన్నారు. వెంకుపాలెం ఎంపీటీసీ వెంకటేష్ మాట్లాడతూ బీసీ కార్పొరేషన్ రుణాలను కూటమి మద్దతు దారులకు మాత్రమే మంజూరయ్యే పరిస్థితులు ఉన్నాయన్నారు. 1059 మంది దరఖాస్తు చేసుకుంటే 78 యూనిట్లు మాత్రమే మంజూరు చేయడమేమిటని ప్రశ్నించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలకు రెవెన్యూ శాఖ స్థలాలను కేటాయించాలని, భవనాల నిర్మాణాలకు నిధులు కేటాయించాలని సీడీపీవో శశికళ కోరారు. మొత్తానికి సభ ఆదత్యం రసాభాసగా జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ అత్యవసరమైన మంచినీరు, పారిశుధ్యం పనులకు 15వ ఆర్థిక సంఘం నిధులు కేటాయిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ భీశెట్టి వరహా సత్యవతి, వైస్ ఎంపీపీలు విల్లూరి సూర్యకుమారి, ఆనందరామ్, ఎంపీడీవో కె.వి. నరసింహారావు, ఈవోపీఆర్డీ కె.వి.వి. ప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రావెల్ లారీ పట్టివేత



కశింకోట పోలీసులు పట్టుకున్న గ్రావెల్ లారీ

కశింకోట: మండలంలోని ఏఎస్ పేటలో లారీలో అక్రమంగా గ్రావెల్ తరలిస్తుండగా దాడి చేసి పట్టుకున్నట్లు సీఐ అల్లు స్వామినాయుడు మంగళవారం తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సోమవారం రాత్రి లారీని పట్టుకొని తహసీల్దార్ కార్యాలయానికి అప్పగించామన్నారు.

30 లీటర్ల సారా స్వాధీనం



పాయకరావుపేట: మండలంలో పెద రాంభద్రపురం, ఈదటం గ్రామాల్లో దాడులు నిర్వహించి 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. ఎక్సైజ్ ఎస్ఐలు కె.మురళీమోహన్ రావు, వీఎల్ ప్రశాంతి దాడులు నిర్వహించి పెదరాంభద్రపురం, వీరవరపుపేట, ఈదటం గ్రామాలకు చెందిన నలుగురిని అదుపులోకి తీసుకున్నారన్నారు. వీరిలో ఇద్దరు మహిళలు ఉన్నారన్నారు. వీరిని యలమంచిలి కోర్టుకు తరలించినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చింతలపాలెంలో మురుగుతో అవస్థలు



చింతలపాలెంలో సిమెంట్ రోడ్డుపై నిలిచిన మురుగునీరు

కశింకోట: మండలంలోని చింతలపాలెం గ్రామంలో జాతీయ రహదారి నుంచి గ్రామంలోకి వెళ్లే సిమెంట్ రోడ్డుపై మురుగు ఏరులా పారుతూ నిలిచిపోతోంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నామని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఈ విషయమై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోతోందని విమర్శిస్తున్నారు. దీంతో నిత్యం రాకపోకలకు నరకయాతన అనుభవించాల్సి వస్తోందని వాపోతున్నారు. గ్రామంలోని మధ్య వీధి ప్రాంతంలో మురుగు కాలువల నుంచి వాడుక నీరు వచ్చి సరైన మార్గం లేక సిమెంట్ రోడ్డుపైన అడ్డంగా అధ్వానంగా నిలిచిపోతోంది. ఈ నీరు జాతీయ రహదారికి చెందిన పక్క కాలువ నుంచి పోవాల్సి ఉంది. అయితే జాతీయ రహదారి కాలువలోకి మురుగు నీరు వెళ్లడానికి సరైన మార్గం లేకపోవడం, ఆ కాలువ ఎత్తు అయిపోవడం వల్ల ప్రవహించక మురుగు రోడ్డుపై నిల్వ ఉండిపోతున్న పరిస్థితి నెలకొంది. దీంతో గ్రామంలోకి రాకపోకలు సాగించే ప్రజలు నిత్యం ఇబ్బంది పడాల్సి వస్తోందని, దుర్వాసన భరించలేక ముక్కు మూసుకొని రాకపోకలు సాగించాల్సి వస్తోందని వాపోతున్నారు. మురుగు నీరు పోవడానికి చర్యలు చేపట్టాలని జాతీయ రహదారి అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదని సర్పంచ్ కొట్టె రాము తెలిపారు. దీంతో ప్రజలు ఇబ్బంది చెందుతున్నారని, ఇప్పటికైనా ఉన్నత అధికారులు కల్పించుకొని మురుగు నిల్వ ఉండకుండా పోవడానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని కోరారు.

మే నెలాఖరుకు 3 లక్షల ఇళ్లు పూర్తి



మాట్లాడుతున్న తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట : రాష్ట్రంలో మే నెలాఖరుకు మూడు లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు చేపట్టామని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు తెలిపారు. మంగళవారం ఆయన వడ్డాదిలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా పేద పేజలకు ఇళ్లు అందిస్తాయన్నారు. గత ప్రభుత్వంలో మధ్యలో ఆగిపోయిన ఇళ్లతో మంజూరై ప్రారంభం కాని ఇళ్లు, కొత్తగా నిర్మాణం చేపట్టే ఇళ్లకు బిల్లులు మంజూ చేస్తామన్నారు. రాష్ట్రంలో కొత్తగా 5,98,710 మందికి ఇళ్లు మంజూరైనట్టు తెలిపారు. రాష్ట్రంలో పని చేస్తున్న జర్నలిస్టులందరికి ఇళ్లు నిర్మించి ఇవ్వడానికి ముఖ్యమంత్రి, హౌసింగ్‌శాఖ మంత్రి పార్థసారథితో కలిసి చర్యలు చేపడుతున్నామన్నారు.

గొర్లివానిపాలేనికి ట్రాక్టర్ అందజేత



ట్రాక్టర్ కీని అందిస్తున్న లారస్ సీఈవో చావా సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ నరసింహరావు

పరవాడ: లారస్ ల్యాబ్స్ సహకారంతో గొర్లివానిపాలెం గ్రామాభివృద్ధికి సమకూర్చిన ట్రాక్టర్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లారస్ ల్యాబ్స్ సీఈవో చావా సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ చావా నరసింహరావు కోరారు. లారస్ ల్యాబ్స్ ఆర్థిక సాయంతో సమకూర్చిన ట్రాక్టర్‌ను సర్పంచ్ గొర్లి గోపి అమ్ములుకు మంగళవారం అందించారు. గ్రామాభివృద్ధితోపాటు, గ్రామ దేవతల ఆలయాల అభివృద్ధికి సహకరించిన లారస్ ల్యాబ్స్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గొర్లి రామారావు, వార్డు సభ్యులు పోలిరెడ్డి అప్పారావు, పైల అప్పారావు, పంచాయతీ కార్యదర్శి తరుణ, పోలిరెడ్డి వెంకటరావు, లారస్ ఉద్యోగులు పాల్గొన్నారు.